క్లుప్తంగా

వారంలో మూడురోజులు గుడ్డు ఇవ్వాలి



మధ్యాహ్నభోజనం పరిశీలిస్తున్న ఎంఈవో

సారంగాపూర్: మధ్యాహ్నభోజనంలో వారంలో మూడు రోజులు తప్పనిసరిగా కోడిగుడ్లు ఇవ్వాలని ఎంఈవో వాసం భీమయ్య అన్నారు. శుక్రవారం సారంగాపూర్ ఉన్నతపాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు. శుభ్రత పాటించాలని మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ఆయనవెంట హెచ్ఎం వేణుగోపాల్ ఉన్నారు.

దళితబహుజనుల హక్కుల సాధనే లక్ష్యం



మాట్లాడుతున్న నాయకులు

జగిత్యాల: దళిత బహుజన హక్కుల సాధనే లక్ష్యంగా మార్చి 25న పెగడపల్లి మండలంలో జగిత్యాల జిల్లాస్థాయి భారీ బహిరంగ సభ ఏర్పాటుచేసినట్లు టీజేఏసీ రాష్ట్ర ప్రెసిడెంట్ భాస్కర్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్ర కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు కేంద్రప్రభుత్వం ప్రభుత్వ స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు దారదత్తం చేస్తోందని ఆరోపించారు బహిరంగ సభలో రాష్ట్రచైర్మన్ గజ్జెల కాంతం పాల్గొంటున్నారని, సభను విజయవంతం చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు పవన్,రాజు, రాజయ్య, సురేశ్,దీపక్,రాజయ్య పాల్గొన్నారు.

వార్డుల అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్

కోరుట్ల: పట్టణంలోని 16వ వార్డును అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానని కౌన్సిలర్ బలిజ పద్మ అన్నారు. శుక్రవారం వార్డుకమిటీల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వార్డుల్లోని పలు సమస్యలను ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య సహకారంతో పరిష్కరిస్తామన్నారు. అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో వార్డు ప్రత్యేక అధికారి పేట అశోక్ ఆర్‌పీ పావని, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మహిళా హక్కులపై అవగాహన



అవగాహన సదస్సులో పాల్గొన్న మహిళలు

మేడిపెల్లి: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహిళల హక్కులు, సమానత్వం, వివక్షవంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళలపై వేధింపులు, వాటిని ఎదుర్కొనేందుకు ఏర్పాటుచేసిన టోల్ ఫ్రీ నంబర్‌లతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సీడీపీవో వీరలక్ష్మీ, సఖిసెంటర్ అధికారి అశ్విని, సర్పంచ్ క్యాతం వరలక్ష్మి ఎంపీపీ ఉమాదేవి, ఎంపీటీసీ వినోద, భాగ్యలక్ష్మీ, అంగన్‌వాడీలు,ఆయాలు పాల్గొన్నారు.

నిధులు విడుదలపై హర్షం

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారం గ్రామశివారులోని అరగుండాల ప్రాజెక్టుకు రూ.1.41 కోట్లు విడుదల చేయడానికి కృషి చేసిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌కు తాళ్లధర్మారం, చిత్రవేణిగూడెం గ్రామాల రైతులు కృతజ్ఞతలు తెలిపారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు నల్ల మహిపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నారపాక రమేశ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిశారు. ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నిర్మించేందుకు ప్రభుత్వం రూ.1,41,30,000 మంజూరుకు ఎమ్మెల్యే కృషితో నిధులు విడుదలయ్యాయన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయం నిర్మాణానికి భూమిపూజ

కథలాపూర్: మండలంలోని సిరికొండలో రేణుకా ఎల్లమ్మ ఆలయం నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ ఆలయాన్ని గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. సంఘం సభ్యులు ప్రత్యేక పూజలు చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దొమ్మాటి ఆనంద్‌గౌడ్,అర్చకులు నరేశ్‌శర్మ, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే కూరగాయల అమ్మకాలు

- ట్రాఫిక్ సమస్యతో వాహనదారుల తిప్పలు
- నిరుపయోగంగా మున్సిపల్ మార్కెట్
- రూ. లక్షల్లో ప్రజాధనం వృథా



రోడ్డుపై కూరగాయలు అమ్ముతున్న వ్యాపారులు, కొనుగోలు చేస్తున్న స్థానికులు

జగిత్యాలటౌన్: అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నచందంగా తయారైంది జగిత్యాల మున్సిపల్ మార్కెట్ పరిస్థితి. టవర్‌సర్కిల్ ప్రాంతంలోని ప్రధాన కూరగాయల మార్కెట్‌లో రద్దీని తగ్గించడంతో పాటు మోచీబజార్ నుంచి టవర్‌రోడ్డులో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ఏర్పాటుచేసిన మున్సిపల్ మార్కెట్ రైతులు లేక వెలవెలబోతోంది. సకల సౌకర్యాలతో నిర్మించిన కూరగాయల మార్కెట్‌లో అమ్ముకోవాల్సిన కూరగాయలను రోడ్డుపై విక్రయిస్తుండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మటన్, చికెన్, చేపలు కూరగాయలు, పండ్లు, నిత్యావసర సరుకులు విక్రయించేలా సకల సౌకర్యాలతో ఏర్పాటుచేసిన మార్కెట్ నిరుపయోగంగా మారి మున్సిపల్ వాహనాలకు పార్కింగ్ కోసం వినియోగించుకునే పరిస్థితి నెలకొంది మార్కెట్‌లోని షెడ్లన్నీ ఖాళీగా ఉండడంతో పోకిరీలకు అడ్డాగా మారింది. కూరగాయల విక్రయాలు సాగకపోవడంతో మున్సిపల్ మార్కెట్ పాడై రూ. లక్షల్లో ప్రజాధనం వృథాగా మారే ప్రమాదం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ట్రాఫిక్‌పోలీసులు, బల్దియా అధికారులు చొరవచూపి రోడ్డుపై కూరగాయల విక్రయాలను నిలిపివేసి ట్రాఫిక్ సమస్యను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో ప్రజాధనం వృథా...

పెరుగుతున్న జనాభా పట్టణ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అప్పటి గత ప్రభుత్వాలు రూ. 50 లక్షలు వెచ్చించి శాశ్వత షెడ్లు నిర్మించి తాగునీటి వసతితో పాటు మూత్రశాలలు సకల సౌకర్యాలతో రైతుబజార్ నిర్మించారు. అధికారుల అలసత్వం, పాలకుల నిర్లక్ష్యంతో రైతు బజార్ మూతపడింది.

గతంలోనూ ఇదే పరిస్థితి..

అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో గతంలో ఓసారి రైతుబజార్ మూతపడింది. ఆ తర్వాత కొంతకాలం ప్రైవేట్ వ్యక్తుల నిర్వహణలో ఫంక్షన్‌హాలుగా కొనసాగింది. గత కాంగ్రెస్ పాలకవర్గం మరో రూ. 50 లక్షలు వెచ్చించి మరమ్మతులు చేసి మున్సిపల్ మార్కెట్‌గా తిరిగి ప్రారంభించారు.

నియంత్రణ కరువు...

మున్సిపల్ మార్కెట్ విక్రయాలపై అధికారుల నియంత్రణ కరువవడంతో అమ్మకం దారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. మార్కెట్ లోపలంతా ఖాళీగా ఉంటే రోడ్డుపై విక్రయించడం ఎందుకని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మున్సిపల్ మార్కెట్ ఎదుట రోడ్డుపై కూరగాయలు, పండ్ల విక్రయాలు నిలిపివేసి మార్కెట్ లోపల అమ్మకాలు జరిపేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మార్కెట్‌లో ఖాళీగా షెడ్లు

అందరితో పాటు మేము



గతంలో మేము లోపలే కూరగాయలు అమ్మేటోళ్లం. కొందరు బయట అమ్మడంతో కొనుక్కునే వాళ్లు బయట ఉన్న వాళ్ల దగ్గరే కొనుక్కుని వెళ్లిపోతున్నారు. అందుకే మేం కూడా బయటే అమ్ముతున్నాం. – ఎట్టి మల్లవ్వ

చర్యలు తీసుకుంటాం



మున్సిపల్ మార్కెట్ బయట రోడ్డుపై అమ్మకాలు సాగుతున్నది వాస్తవమే. మార్కెట్ లోపలే విక్రయాలు సాగేలా చర్యలు తీసుకుంటాం. వాహనదారుకుల ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకుంటాం. – బోనగిరి నరేశ్, బల్దియా కమిషనర్ జగిత్యాల

సామాన్యుడి నెత్తిపై గుదిబండ

- వంటగ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ బీఆర్ఎస్, సీపీఐ నాయకుల ఆందోళన
- పాత మున్సిపల్ ఎదుట వంటావార్పు
- ప్రధానరోడ్లపై బైఠాయింపు



వంటగ్యాస్ ధరలు తగ్గించాలని ధర్మపురిలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కోరుట్ల/మెట్‌పల్లి/మల్యాల/ఇబ్రహీంపట్నం/గొల్లపల్లి/పెగడపల్లి/ధర్మపురి/మేడిపెల్లి/మల్లాపూర్/సారంగాపూర్: కేంద్రప్రభుత్వం వంటగ్యాస్‌పై పెంచిన ధరలను నిరసిస్తూ బీఆర్ఎస్, సీపీఐ ఆధ్వర్యంలో జగిత్యాల పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట, కోరుట్ల పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట, మెట్‌పల్లి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద, మల్యాల మండలకేంద్రంలోని అంగడిబజార్‌లో, కథలాపూర్‌లో రోడ్డుపై బైఠాయించి నాయకులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఇబ్రహీంపట్నం మండలకేంద్రంలోని ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద కట్టెల పొయ్యిపై వంటావార్పుతో నిరసన తెలిపారు. కోరుట్ల ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యుడు బాలకృష్ణ, సీపీఎం ప్రజా సంఘాల జిల్లా కన్వీనర్ తిరుపతి నాయక్ కేంద్రం తీరుపై మండిపడ్డారు. గొల్లపల్లిలో ధర్నా నిర్వహించారు. పెగడపల్లి మండలకేంద్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు వేర్వేరుగా ఆందోళన చేశారు. సిలిండర్లను రోడ్డుకు అడ్డుగా పెట్టి రాస్తారోకో చేశారు. ధర్మపురిలో మంత్రి కొప్పుల ఈశ్వర్ సతీమణి స్నేహలత ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై బీఆర్ఎస్ నాయకులు పెద్దఎత్తున రాస్తారోకో చేపట్టారు. మేడిపెల్లిలో జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరాస్తా వద్ద ధర్నా నిర్వహించారు. మల్లాపూర్ మండలంలోని భరతమాత కూడలి వద్ద గ్యాస్ సిలిండర్, కట్టెలపొయ్యితో వంటచేస్తూ బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పాల్గొని నాలుగు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే కేంద్రం సిలిండర్ ధరను కేంద్రం అమాంతంగా పెంచిందని విమర్శించారు.



వంటావార్పు చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఐ ఆందోళన

రెడ్డిసంఘం భవనానికి నిధులు మంజూరు

కొడిమ్యాల: మండలంలోని పూడూరు రెడ్డిసంఘం భవన నిర్మాణానికి చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ రూ.4.60 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈమేరకు పూడూరు సింగిల్‌విండో చైర్మన్ బండ రవీందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ బండ లింగారెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, నాయకులు నాగభూషణ్‌రెడ్డి, రామ్‌రెడ్డి, అజయ్‌రెడ్డికి మంజూరు పత్రం అందించారు. ఈ సందర్భంగా నిధుల మంజూరుకు కృషిచేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



మంజూరు పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

అభివృద్ధి పనులకు పెద్దపీట



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

గొల్లపల్లి: బీఆర్ఎస్ అధికారంలో ఉన్న గ్రామాల్లో అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తోందని లొత్తునూర్ సర్పంచ్ గుంటుక రాజేశ్వరి అన్నారు. మండలంలోని లొత్తునూర్‌లో రూ.10 లక్షలతో చేపట్టే సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కటారి రామేశ్వర్‌రావు, ఎంపీటీసీ సంతోషి, మారుతి, ఉప సర్పంచ్ తిరుపతి, ఆకుల రాజు, బోంగోని ప్రవీణ్ గుంటుక కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

మల్లాపూర్: ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆలీమొద్దీన్ అన్నారు. శుక్రవారం మల్లాపూర్ మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఫేర్‌వేల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదర్శపాఠశాల, కళాశాలలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలోనే ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాయన్నారు. మోడల్ స్కూల్‌లో క్రమశిక్షణ, నైతికవిలువలు, ఉత్తమ మార్గదర్శకత్వం అందిస్తున్న అధ్యాపక బృందంను అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు, నాటికలు, గేమ్‌షోలు, అభినయ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ రాజేందర్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

‘కంటివెలుగు’ వైద్యశిబిరం

ఇబ్రహీంపట్నం: గ్రామాల్లో ప్రజలు ‘కంటివెలుగు’ వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ జాజాల భీమేశ్వరి కోరారు. శుక్రవారం మండలంలోని మూలరాంపూర్‌లో ‘కంటివెలుగు’ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఎంపీడీవో ప్రభు, తహసీల్దార్ మహేశ్వర్, ఎంపీవో కృపాకర్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, వైద్యాధికారులు రాజేందర్, వివేక్, ఏఎన్ఎం సుప్రియ, ఆశవర్కర్లు పాల్గొన్నారు.



కళ్లద్దాలు అందిస్తున్న ఎంపీపీ జాజాల భీమేశ్వరి

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

పెగడపల్లి: మండలకేంద్రంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను ధర్మపురి ఏడీఏ రామ్‌చందర్ శుక్రవారం తనిఖీ చేశారు. ఎరువులు, క్రిమి సంహారక మందులు పరిశీలించి మాట్లాడారు. ఫర్టిలైజర్స్ దుకాణంలో ఎరువుల నిల్వలకు రిజిష్టర్‌లో పేర్కొన్న వివరాల నమోదులో తేడాలుంటే ఎరువుల విక్రయాలు నిలిపేయాలని ఆదేశించారు. ఏఈవోలు అశోక్, మల్లేశం ఉన్నారు.



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ రామ్‌చందర్

ఇంటర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

కథలాపూర్: మోడల్‌స్కూల్‌లో ఇంటర్ సెకండీయర్ విద్యార్థులకు ఫస్టీయర్ విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నరేశ్ మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థికి ఇంటర్ దశ కీలకమని, బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



వర్షకొండ హైస్కూల్‌లో విద్యార్థుల నృత్యాలు

ఆట పాటలతో వీడ్కోలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ, ఇబ్రహీంపట్నం జెడ్పీపాఠశాలలో శుక్రవారం ఆట, పాటలతో పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. వర్షకొండలో పాఠశాల హెచ్ఎం గడ్డం శ్రీనివాస్‌రెడ్డిని పదో తరగతి విద్యార్థులు ఘనంగా సన్మానించారు. సర్పంచ్ శ్యామల, ఎంపీటీసీ వెంకటి, ఉపసర్పంచు లక్ష్మణ్, హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, గణేశ్ పాల్గొన్నారు.

మన ఊరు మనబడి పనులు 90శాతం పూర్తి

ఇబ్రహీంపట్నం: మన ఊరు మనబడి పనులు 90 శాతం పూర్తయ్యాయని మిగిలిన పనులు పూర్తిచేయాలని ఎంపీడీవో ప్రభు కోరారు. శుక్రవారం మండలంలోని మూలరాంపూర్, ఇబ్రహీంపట్నం, గోధూర్ గ్రామాల్లో మన ఊరు మనబడి పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేసి వారంలోగా పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, తహసీల్దార్ మహేశ్వర్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, ఆయా పాఠశాలల హెచ్ఎం పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఆధ్యాత్మికం..

వైభవంగా రాజరాజేశ్వర కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న జెడ్పీటీసీ దంపతులు

కోరుట్లరూరల్: మండలంలోని మాదాపూర్ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, హోమం నిర్వహించారు. జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య దంపతులు ప్రత్యేక పూజలుచేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు, దంపతులు

బుగ్గారం: మండలకేంద్రంలలోని వెల్గొండ శ్రీసాయి బాబా ఆలయవార్షికోత్సవాన్ని ఆలయకమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలుచేశారు. ఉదయం స్వామివారికి అభిషేకం, నవగ్రహపూజ, హోమం నిర్వహించారు. అనంతరం మహిళలు కుంకుమార్చన పూజలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తిని పల్లకీలో ఊరేగించారు. ఈసందర్భంగా భక్తుల కోలాటం పలువురిని ఆకట్టుకున్నాయి. సర్పంచ్ గాదె తిరుపతి, ఆలయకమిటీ సభ్యులు, వార్డుల సభ్యులు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల సభ్యులు, ధర్మకర్తలు, భక్తులు కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

మల్లిఖార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠ పూజలో పాల్గొన్న భక్తులు

కథలాపూర్: మండలంలోని చింతకుంట శ్రీ మల్లిఖార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం యజ్ఞం కాల్చారు. ఉత్సవాలకు హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీధ్రువమూర్తి విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న మాజీ ఎంపీపీ

వెల్గటూర్: మండలంలోని కిషన్‌రావుపేట నాగేపల్లి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం లక్ష్మీధ్రువమూర్తి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను ఆలయ అర్చకులు జగన్నాథం విష్ణువర్ధనచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పొనుగోటి శ్రీనివాస్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గిరిప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నైనాల అజయ్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి



నివాళి అర్పిస్తున్న బోగ శ్రావణి, బీజేపీ కార్యకర్తలు

జగిత్యాల: మహిళలకు రక్షణ కల్పించాలని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్, బీజేపీ నాయకురాలు బోగ శ్రావణి అన్నారు. శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్ చౌరస్తాలో వైద్య విద్యార్థిని ప్రీతి మృతికి సంతాపకంగా ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. అత్యాచారం, హత్యలు జరిగినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సత్యనారాయణ, మదన్‌మోహన్, అర్వలక్ష్మి పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం

జగిత్యాలజోన్: రూరల్ మండలంలోని జాబితాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి జగిత్యాల మేరు కులస్తులు రూ.19వేలు ఆర్థికసాయం అందించారు. కుటుంబ పెద్ద ఓదెల అంజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, కుటుంబీకులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో మేరు కులస్తులు స్పందించి ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో పట్టణ మేరుసంఘం అధ్యక్షుడు మాడిశెట్టి మల్లేశం, నాయకులు గట్ల రమేశ్, గట్ల రాధాకిషన్, యమున, లక్ష్మీ, గంగాధర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న మేరు కులస్తులు